# గొప్ప దిద్దుబాటు
## (కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక సంగ్రహ సమీక్ష)

**A. ఉపోద్ఘాతము :** పౌలు వ్రాసిన పత్రికలలో ద్వితీయ స్థానాన్ని అలంకరించిన పత్రిక కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక. ప్రథమ స్థానాన్ని అలంకరించిన రోమీయులకు వ్రాసిన పత్రిక మూలాంశం దేవుని నీతి. దానిని క్రైస్తవ జీవితంలో ఎలా అన్వయించుకోవాలో కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక వివరిస్తుంది.

**1. గ్రంథకర్త :** ఈ పత్రిక అపొస్తలుడైన పౌలుచే వ్రాయబడిందని ఆదిమ సంఘం ఆమోదించింది. ప్రామాణిక గ్రంథముగా బైబిలులో చేర్చబడేందుకు ప్రప్రథమంగా అధికారాన్ని పొందిన పత్రిక ఇది.

**2. కాలము :** పౌలు ఎఫెసు పట్టణంలో ఉన్న 3 సంవత్సరాల కాలంలో, బహుశా క్రీ.శ. 55వ సంవత్సరం ఈ పత్రికను వ్రాసి పంపించాడని పండితుల అభిప్రాయం. ప్రస్తుతం బైబిలులో ఉన్న రెండు పత్రికలే కాక కొరింథు సంఘానికి మరికొన్ని పత్రికలు వ్రాసినట్లు తెలుస్తున్నది. (I కొరి 5:9; 16:17 చదవండి).

**3. ముఖ్యాంశం :** ప్రభువుగా యేసుక్రీస్తు అధికారం.

**4. సందర్భం :** పౌలు తన మూడవ సువార్త దండయాత్రలో ఎఫెసు పట్టణంలో ఉన్నప్పుడు కొరింథు సంఘంలో జరుగుతున్న సంగతులను గూర్చి విన్నాడు. (1:11,12). అదే సమయంలో ఆ సంఘం నుండి పౌలు దగ్గరకి వచ్చినవారు ఆ సంఘంలోని సిద్ధాంతపరమైన సమస్యలను గూర్చి చెప్పారు. సమస్యలతో కూడిన వారి ప్రశ్నలకు జవాబు చెప్తూ, వారి నైతిక సమస్యను గూర్చి హెచ్చరిస్తూ పౌలు ఈ పత్రికను వ్రాసాడు.

**5. గ్రంథ విశిష్ఠత :** ఈ పత్రిక రోమీయులకు వ్రాసిన పత్రిక మరియు గలతీయులకు వ్రాసిన పత్రికలవలె సిద్ధాంతపరమైనది కాదు గాని, క్రైస్తవ విశ్వాసాన్ని క్రమమైన రీతిగా బోధించే పత్రిక. ఈ పత్రిక నైతిక, సామాజిక సత్యాలను ఉద్ఘాటిస్తుంది. కొరింథు సంఘస్తులు ప్రభువుగా యేసు అధికారాన్ని గుర్తించనందువలన ఏర్పడిన సమస్యలన్నిటికి ఆయనే పరిష్కారం అని, ఆయనే సంఘానికి శిరస్సు అని జ్ఞాపకం చేస్తూ ఈ పత్రికలో ప్రభువు అనే మాట ఎక్కువగా ఉపయోగించబడింది (ఉదా:- 1:31; 2:8,16; 3:20; 4:4;5: 4,5; 6:13)

ఈ పత్రిక క్రైస్తవ సౌశీల్యాన్ని గూర్చి నొక్కి వక్కాణిస్తుంది. పునరుత్థాన నిరీక్షణను గూర్చిన సిద్ధాంతం ఈ పత్రికకు తలమానికం.

కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక వ్రాయబడిన 40 సంవత్సరాలకు రోము నుండి పంపించబడిన మొదటి క్లెమెంటు తన పత్రికలో “అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రికను చదవండి” అని వ్రాసాడు. తన బోధలలో క్లెమెంటు ఈ పత్రికను విశేషంగా ఉపయోగించాడు. ఆలాగే ఇగ్నెషియస్, జస్టిన్ మార్టిన్, ఐరెనియస్, టెర్టులియన్ మొదలగు సంఘ పితరులు ఈ పత్రికలోని విషయాలనెత్తి సంఘాలను హెచ్చరించారు.

**B. గ్రంథ విభజన :** ఈ పత్రికలోని అంశాలను బట్టి దానిని మూడు ప్రధాన భాగాలుగా విభజించవచ్చును.

**I. శుభములు 1:1-9.**

**II. శరీరాను సారమైన విషయాలు (కొరింథు సంఘ పరిస్థితి).**

**అ. విభేదాలు (1:10-4:21).**

1. సంఘానికి మూల కేంద్రమైన క్రీస్తే విభేదాలను తొలగిస్తాడు (1:10-31).
2. పరిశుద్ధాత్మను గూర్చిన స్పష్టత మానవ జ్ఞానాన్ని సరిచేస్తుంది (2 అధ్యా).
3. దేవుని గూర్చిన సరైన గ్రహింపు క్రైస్తవ పరిచర్యను స్పష్టం చేస్తుంది (3 అధ్యా).
4. క్రైస్తవ సేవకుని స్థితి క్రైస్తవ సౌశీల్యానికి కట్టుబడి ఉంటుంది.

**ఆ. కొరింథు సంఘంలోని అవమానకరమైన విషయాలు (5:1-6:20).**

1. అపవిత్రత 5:1-3.
2. వ్యాజ్యములు 6 అధ్యా.
3. వివాహము గూర్చి 7 అధ్యా.
4. క్రైస్తవ స్వాతంత్ర్యము గూర్చి 8:1-11:1.
5. స్త్రీల వస్త్రధారణ గూర్చి 11:2-16.
6. ప్రభువు బల్లను గూర్చి 11:17-34.
7. ఆత్మ వరాలను గూర్చి 12:14 అధ్యా.
8. సువార్తను గూర్చి 15 అధ్యా.
9. విరాళములను గూర్చి 16:1-9.

**III. తుది హెచ్చరికలు మరియు ఆశీర్వచనం 16:10-24.**

## C. అంశాలవారిగా సంక్షిప్త వివరణ :

**I. కొరింథు సంఘము :** ఇది ఐరోపా ఖండంలోని అకయకు ముఖ్య పట్టణం. తూర్పు పడమర దిశల్లో రహదారి కలిగిన ఈ పట్టణం వాణిజ్యానికి కర్మాగారాలకు కేంద్రంగా ఉండినది. ప్రపంచంలోని అన్ని జనాంగాలకు చెందిన ప్రజలు ముఖ్యంగా గ్రీకులు, రోమీయులు, యూదులు ఈ పట్టణంలో స్థావరాలను ఏర్పరచుకొన్నారు. వివిధ రకాల తత్త్వ శాస్త్రజ్ఞులున్నా, గ్రీకు తత్త్వ శాస్త్రమే వారిపై ఎక్కువగా ప్రభావాన్ని చూపించింది.

పౌలు కాలంలో ఈ పట్టణంలో 4,00,000 మంది నివాసమున్నారు. ఇక్కడి మిశ్రమ సంస్కృతి, తూర్పు మరియు పశ్చిమ దేశాల నైతిక దుర్మార్గత మనిషిని పతనావస్థకు తీసికొని వెళ్ళాయి. ఈ పట్టణంలోని మతకార్యకలాపాలన్నీ వ్యభిచారంతో కూడినది. అఫ్రొడైట్ లేక వీనస్ అనే దేవతాలయంలో వేలాది దేవదాసిలుండేవారు. వారి నిరాధార పాప సహిత మత కార్యకలాపాలకు గ్రీకు తత్వం కూడా తోడైంది. ఆ పట్టణం ఎంతగా లైంగిక అవినీతి, విలాసాలకు కేంద్రంగా ఉండినది అంటే ఎవరైన పాపంచేస్తే, నీలో కొరింథీయత ఉంది అని వ్యాఖ్యానించే వారు. అంటే వారిలో కొరింథులో ఉన్నంత అపరిమిత పాపం ఉందన్న మాట.

సువార్తకు ఏలాంటి అవకాశంలేని, ఇంకా చెప్పాలంటే అన్నీ ఆటంకాలే ఉన్న ఈ పట్టణంలో పౌలు సంఘాన్ని స్థాపించాడు. (అపొ 18 అధ్యా) ఈ పట్టణంలో 18 నెలలు వాక్యాన్ని బోధించాడు. పౌలు అక్కడి నుండి వెళ్ళాక అపొల్లో ఎఫెసు నుండి వచ్చి అక్కడ పరిచర్య చేసాడు. (అపొ 18:24-28; I కొరి 3:6).

కొరింథు సంఘంలో ఏర్పడిన సమస్యలు నేటి ఆధునిక సంఘ సమస్యలకు అతీతమైనవేమి కాదు. ఆనాడు ఉన్న సమస్యలే ఈనాడు కూడ ఉన్నాయి. కనుక నేటి సంఘం ఎదుర్కొంటున్న వ్యక్తిగత, నైతిక, వేదాంతపర సమస్యలకు పరిష్కార మార్గం కనుగొనాలంటే కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక తప్పకుండా చదవాల్సిందే.

## II. కొరింథు సంఘ సమస్యలు - వాటికి కారణాలు :

1. **మానవ నాయకత్వాన్ని అనుసరించుట 1:10-17:** కొరింథు సంఘంలోని విశ్వాసులు పౌలు వారని, అపొల్లో వారని, కేఫావారని, క్రీస్తువారని నాలుగు గుంపులుగా ఏర్పడ్డారు. గ్రీకు రాజకీయాలు, వారిపై ఎక్కువగా ప్రభావం చూపించాయి. బోధకులను బట్టి, సిద్ధాంతాలను బట్టి, ఈనాడు కూడా సంఘాలలో చీలికలు ఏర్పడడం చాలా శోచనీయం. మానవ నాయకత్వానికి ప్రాధాన్యతనిచ్చే సంఘాలన్నీ ఇలాగే ఉంటాయి.
2. **భూసంబంధమైన జ్ఞానం వైపు మొగ్గుచూపుట 1:18-2:13:** కొరింథీయుల స్వయం పొగడ్త వారి జ్ఞానాన్ని పెడత్రోవ పట్టించింది. ఈ భాగంలో పౌలు, జ్ఞానానికి, విశ్వాసానికి మధ్య గల వ్యత్యాసాన్ని గూర్చి విశదీకరించాడు. ఈలోక జ్ఞానంతో దేవుణ్ణి తెలిసికోవడం అసాధ్యం. కనుక దేవుడు విశ్వాసము అనే నూతన విధానాన్ని ప్రవేశపెట్టాడు. ఈ విశ్వాసము అన్నది మానవ జాతిని రెండు గుంపులుగా విభజిస్తుంది. యేసుక్రీస్తు సిలువలో విశ్వాసముంచి పాపక్షమాపణ పొందేవారు ఒక గుంపు, సిలువను తృణీకరించేవారు మరోగుంపు (1:18) సిలువ ద్వారానే మానవులు రక్షించబడాలి అనే పద్ధతినే దేవుడు ఎన్నుకొన్నాడు. సిలువను గూర్చిన వార్త ఈలోక సంబంధమైనది కాదు (2:1-6), అది ఈ లోకారంభానికి ముందే ఉన్నది (2:7,8).
3. **శరీరానుసార స్థితిలో కొట్టుమిట్టాడుట (2:14-3:7) :** ఈలోక జ్ఞానం ప్రపంచాన్ని గూర్చిన తత్త్వము మరియు తర్కముతో కూడినది. పౌలు దేవుని రాయబారిగా దేవుని మర్మాన్ని ఉన్నది ఉన్నట్లుగా ప్రకటించాడు. అయితే ఆత్మ సంబంధి మాత్రమే దైవజ్ఞానాన్ని, ఆయన రక్షణ ఏర్పాటును గ్రహించగలడు. ఈ సందర్భంగా పౌలు మనుషుల్ని మూడు గుంపులుగా విభజించాడు. మొదటి గుంపు ప్రకృతి సంబంధులు. వీరు దేవుని విషయాలను గ్రహించలేరు. నూతన జన్మ అనుభవం లేనివారు. రెండవ గుంపు ఆత్మానుసారులు. వీరు రక్షణానుభవం కలిగి దేవుని ఆత్మ స్వాధీనంలో ఉండి ఆత్మచేత నడిపించబడతారు. (గలతీ 5:16,25) వారు అన్నిటికి వివేచిస్తారుగాని ఎవరి చేతనైనను వివేచింపబడరు (I కొరి 2:15). వీరు క్రీస్తు మనస్సుగలవారు (I కొరి 2:16) తమ స్థితిని గూర్చి యథార్థంగా ఒప్పుకొంటారు. (రోమా 7:14). మూడవ గుంపును గూర్చి పౌలు ఎక్కువగా శ్రద్ధ వహించాడు. వీరు శరీర సంబంధులు. వీరు ఆధ్యాత్మికంగా పరిపక్వతనొందనివారు. చిన్న పిల్లలవలె నిస్సహాయులు

ఆధ్యాత్మిక జీవిత అనుభవంలేనివారు. (గల 4:3; ఎఫె 4:14; II పేతు 1:9). పసిబిడ్డలు అంటే పసితనం కావచ్చు లేక దుర్బలత్వం కావచ్చు. వీరు పాలు తప్ప మరే ఆహారం తీసికోలేరు (3:2), ఎదుగుదల ఉండదు. మంచి చెడ్డల వివేచన కూడా ఉండదు. (హెబ్రీ 5:11-14) వీరికి అవిశ్వాసులకు తేడా లేదు. వీరు కూడ అవిశ్వాసులలాగే మాట్లాడుతారు వారిలాగే ప్రవర్తిస్తారు (3:3).

4. **రాబోయే తీర్పును మరచిపోవుట (3:8-23) :** ఈభాగం విశ్వాసుల పనికి సంబంధించినది. ఇక్కడ ప్రస్తావించబడిన తీర్పు విశ్వాసుల గత పాపాలకు సంబంధించినదికాదు. అది అవిశ్వాసులు ఎదుర్కొనే ధవళ సింహాసన తీర్పుకాదు. ప్రతి విశ్వాసి లేక క్రైస్తవుడు ఓ గృహ నిర్వాహకుడు (4:2). ప్రతి ఒక్కరూ తాము చేసిన పనిని గూర్చి యజమానియైన దేవునికి లెక్క అప్పగించాలి. క్రీస్తు న్యాయపీఠం ఎదుట నిలబడాలి. (II కొరి 5:10; రోమా 14: 10-12).

విశ్వాసుల పనులు రెండు రకాలు. ఒకరకం అగ్నిలో కాల్చివేయబడేవి. (కఱ్ఱ, గడ్డి, కొయ్యకాలు) మరో రకం అగ్ని పరీక్షకు నిలిచేవి. (బంగారము, వెండి, వెలగల రాళ్ళు).

ఆతిథ్యం లేక పరిచర్య (మత్త 10:41,42; హెబ్రీ 6:10). అధికారం లేక ఆధిక్యతల సద్వినియోగం (హెబ్రీ 13:17; యాకో 3:1), కృపావరాలను (II తిమో 1:6; I కొరి 12:4,11) ధనమును (II కొరి 89:6,7; I తిమో 6:17-19) సమయమును (ఎఫె 5:16; కొల 4:5; I పేతు 1:17) సద్వినియోగం చేసికొనుట; క్రీస్తు కొరకు శ్రమ పడుట (మత్త 5:11,12; I పేతు 4:12,13; II కొరి 4:17; రోమా 8:18) మనముందున్న పందెములో పరుగెత్తుట (I కొరి 9:24; ఫిలి 3:13,14 హెబ్రీ 12:1) పాతస్వభావాన్ని అదుపులో ఉంచుకొనుట (I కొరి 89:25-27) ఆత్మల సంపాదన (సామె 11:30; I థెస్స 2:19,20) మొదలైనవన్నీ ప్రతిఫలాన్ని పొందగలిగే పనులు. ఇవి అగ్ని పరీక్షలో నిలుస్తాయి.

క్రీస్తున్యాయ పీఠం వద్ద కొంత మందికి బహుమానాలు లభిస్తాయి. (I కొరి 3:14; 9:25-27) మరికొంతమంది నష్టపోతారు. (I కొరి 3:5). క్రీస్తు కొరకు అన్నిటిని నష్టంగా ఎంచుకోవచ్చును (ఫిలి 3:5,6) కాని క్రీస్తులో మనకు కలిగి ఉన్న వాటిని పోగొట్టుకోవద్దు. (కొల 2:18; II యోహా 8; ప్రక 3:11) జాగ్రత్త సుమా!

మరో ముఖ్య విషయాన్ని కూడ జ్ఞాపకముంచుకోవాలి. మనము చేసిన పనులనుగూర్చి మాత్రమే కాదు, చెయ్యగలిగిన సామర్థ్యం ఉండి కూడ చెయ్యని పనులను గూర్చి కూడ మనం లెక్క అప్పగించాల్సి ఉంటుంది. I కొరి 4:1; మత్త 26:41; ప్రక 3:1-3).

5. **తమను గూర్చి ఉప్పొంగుట (4:1-21) :** కొరింథు సంఘస్తులు స్థానిక సంఘంలో తమ నాయకత్వాన్ని బట్టి అతిశయించారు. వారిలోని ఈ పాపనైజాన్ని మూడు రకాల ఉదాహరణలతో పౌలు సరిచేసాడు.

అ) సేవకుని గూర్చిన సాదృశ్యాలు : నిజమైన క్రీస్తు సేవకుడు వ్యవసాయకుడు (3:6) నిర్మాణకుడు (3:10) గృహ నిర్వాహకుడు (4:1) తండ్రి (4:15) ఉపదేశకుడు (4:17) మరియు శిక్షకుడు (4:21).

ఆ) ప్రవచనాత్మక ఉదాహరణలు : కొరింథీయులు తమను గూర్చి ఉప్పొంగడమే కాక, ఇతరులకు తీర్పు తీరుస్తున్నారు. కాబట్టి క్రీస్తు న్యాయ పీఠం (4:3-5) మరియు వెయ్యేండ్ల పాలన (4:8-10) అనే ప్రవచనాత్మక విషయాలను జ్ఞాపకం చేస్తూ వారిని హెచ్చరించాడు.

ఇ) స్వంత మాదిరి : పౌలు క్రీస్తు కొరకు పొందిన శ్రమలు (4:12,13) మరియు పరిశుద్ధుల పట్ల అతనికిగల శ్రద్ధ (4:14-16)ను ఉదాహరణగా వారిముందుంచాడు.

**6. క్రమశిక్షణ విషయంలో వైఫల్యత (5:1-13) :** కొరింథు సంఘంలో క్రమ శిక్షణ అవసరం (5:1). సంఘంలో ఒక వ్యక్తి జారత్వం చేస్తున్నాడు. అది అందరికీ తెలిసింది. కాని సంఘస్తులు అతన్ని హెచ్చరించలేదు. అతడు మారలేదు. సంఘస్తులు మరొకరికి తీర్పు తీర్చకూడదుగాని సంఘముగా క్రమశిక్షణ చేసే అధికారం ఉంది (5:4,5) క్రమ శిక్షణ చేసే విధానం బైబిలులో వివరించబడింది. (మత్త 18:15,17; గల 6:1). సంఘంలో నుండి ఒక వ్యక్తి వెలివేయబడినప్పుడు అతడు ఈ దుష్టలోకంలో ఎలాంటి విపత్తులకు గురి అవుతాడో అర్థం చేసికొంటాడు. తప్పు చేసిన వ్యక్తి తిరిగి దేవుని వైపు మళ్ళుతాడు (II కొరి 2:6-8). ఆ పాపము సంఘంలో ప్రాకి పోకుండ అరికట్టబడుతుంది. (I కొరి 5:6; మత్త 16:6; గల 5:9). సంఘాన్ని గమనిస్తున్న లోకానికి క్రీస్తు విలువలను చూపించగలుతాము (అపొ 5:1-3).

**7. క్రీస్తు శరీరాన్ని చీల్చి వేయుట (6 అధ్యా) :** క్రైస్తవులు కొన్ని పరిస్థితుల్లో చట్టాన్ని ఆశ్రయించవచ్చు. కాని సంఘములో ఒకరితోనొకరు పోట్లాడుకొని అన్యుల వద్దకు వెళ్ళకూడదు. (6:1) అది దేవుని దృష్టిలో మంచిదికాదని గద్దించాడు. న్యాయస్థానం, చట్టాలు మంచివి కావు అని పౌలు చెప్పడం లేదు. తాను కూడ చట్టాన్ని ఆశ్రయించిన సందర్భాలున్నాయి. (అపొ 25:10,11). సంఘంలోని విశ్వాసులు లోకానికి, దేవదూతలకు తీర్పు తీర్చబోయే వారు. (దాని 7:18,22; మత్త 19:28; I పేతు 2:4; యూదా 6; ప్రక 20:4). గనుక సహ విశ్వాసుల విషయం అన్యుల వద్దకు వెళ్ళ వద్దని చెప్తున్నాడు (6:1-7). ఇలా చెయ్యడం దేవుని దృష్టిలో అవినీతికరం (6:15-20). ఎందుచేతనంటే మన దేహాలు క్రీస్తు శరీరంలోని అవయవాలు (6:15) కనుక విశ్వాసి, ఆధ్యాత్మికము కాని దుష్టలోక సంబంధ పద్ధతులను అనుసరించకూడదు. కొరింథు సంఘ అంతర్గత సమస్యలకు కారణం వారి జీవిత విధానమే (6:11). కాబట్టి పౌలు లైంగికమైన అవినీతి కార్యాల నుండి వారిని దూరంగా పారిపొమ్మని హెచ్చరిస్తున్నాడు (6:18, II తిమో 2:22). ఎందుచేతనంటే మన దేహాలు దేవుని ఆత్మ నివసించే ఆలయాలు (6:19,20). వాటితో మనం దేవుణ్ణి మహిమపర్చాలి. క్రీస్తు మన కోసం గొప్ప వెల చెల్లించి మనల్ని కొన్నాడు.

క్రైస్తవ స్వాతంత్ర్యం అన్నది, ఇష్టం వచ్చినవిచెయ్యడం కాదు గాని, చెయ్యాల్సిన వాటినే చెయ్యడం. దాన్నే పౌలు 6:12లో స్పష్టం చేసాడు. మన స్వేచ్ఛ ఇతరులకు హాని కలిగించకూడదు. మనం ఇష్టమొచ్చినట్లు చెయ్యవచ్చు కాని మన ఇచ్ఛలు క్రీస్తును సంతోషపరుస్తున్నాయా? బలహీన క్రైస్తవులకు నష్టాన్ని కలుగజేస్తున్నాయా? లేక దేవుణ్ణి మహిమ పరుస్తున్నాయా అని ప్రశ్నించి, నిశ్చయించుకోవాలి.

## III. కొరింథీయుల సందేహాలకు పౌలు సమాధానాలు (7-16 అధ్యా) :

ఈ అధ్యాయాలలో పౌలు కనీసం 6 ప్రశ్నలకు సమాధానమిచ్చాడు.

1. **వివాహము :** యూదా మరియు గ్రీకు తత్వ శాస్త్రజ్ఞుల మధ్య వివాహము యొక్క ప్రాముఖ్యతను గూర్చి తల ఎత్తిన విభేదాలను బట్టి పౌలు ఈ అంశాన్ని గూర్చి చర్చించాడు. 7వ అధ్యాయంలో పౌలు వ్రాసిన విషయాలను బట్టి కొంతమంది పౌలు వివాహాన్ని ముఖ్యంగా స్త్రీలను ద్వేషించాడని తలస్తున్నారు. కాని అది వాస్తవం కాదని, పౌలు ఇతర పత్రికల్లో వ్రాసిన విషయాలను బట్టి గ్రహించవచ్చు. (హెబ్రీ 13:4; ఎఫె 5:25-33; I తిమో 4:1-5; 4:14). కొరింథు సంఘంలోని దురాగతాల్ని అరికట్టేందుకు పౌలు వివాహాన్ని ఘనమైనదిగా చూపిస్తున్నాడు. ప్రతి పురుషునికి సొంత భార్య, ప్రతి స్త్రీకి సొంత భర్త ఉండాలని సూచించాడు. ఇద్దరూ వారి వారి ధర్మాన్ని జరిగించాలి (7:3). ఇద్దరిలో ఎవరేగాని మరొకరికి మోసం చేయకూడదు (7:5). ఇక్కడ పౌలు ఒక ప్రధానమైన విషయాన్ని గూర్చి హెచ్చరిస్తున్నాడు. ఇద్దరు అవిశ్వాసులలో ఒకరు వివాహానంతరం రక్షించబడితే, ఆ విశ్వాసి అవిశ్వాసియైన భాగస్వామితోనే కలిసి జీవించాలి (7:12-24).. పరిశుద్ధాత్మ వారిలో తన కార్యాన్ని జరిగించేందుకు మాదిరికరమైన విశ్వాసి సాధనంగా వాడబడతాడు. అయితే వివాహానికి పూర్వమే రక్షించబడిన వ్యక్తి అవిశ్వాసిని వివాహం చేసికోవద్దు. దీన్ని వాక్యం ప్రోత్సహించదు (II కొరి 6:14-18). అవివాహితులు, వివాహితులకంటె ఎక్కువగా, మంచిగా దేవుణ్ణి సేవించగలరని పౌలు తలంచాడు. (7:27-38) కాని అదే సరైనదని చెప్పలేదు. (I తిమో 3:2,11). అది తన సొంత ఉద్దేశం మాత్రమే అని చెప్పాడు (7:6, 12, 25, 40). ఈ అధ్యాయంలో పౌలు చెప్పినవన్నీ చరిత్రలో ఒక ప్రత్యేక కాలంలోని, ప్రత్యేక సంఘానికివ్వబడిన సలహాలు. ఇందులో కొన్ని వచనాలు క్రైస్తవులందరికీ వర్తిస్తాయి, కాని కొన్ని వర్తించవు (7:7,26,29,35).
2. **క్రైస్తవ స్వాతంత్ర్యము (8-10 అధ్యా):**ప్రతి దేవుని బిడ్డ కూడ పాపము మరియు మరణము యొక్క నియమము నుండి విడిపించబడ్డాడు. అలా అని మన ఇష్టానుసారంగా చట్టబద్ధంగా దేనినైనా చెయ్యవచ్చా? పౌలు మూడు సాదృశ్యాలతో ఉదహరించి జవాబు చెప్పాడు.

అ) **అప్పటి కొరింథు సంఘు విశ్వాసుల స్థితి (8:1-13) :** కొరింథు పట్టణంలో అనేక అన్య దేవతాలయాలున్నాయి. వాటిలో ప్రతి రోజు బలులు అర్పించేవారు ప్రతిరోజు పూజారుల వంతు వారికిచ్చిన తరువాత మిగిలిన మాంసమంతా మార్కెటులో తక్కువ ధరకు అమ్మబడేది. దానిని కొంత మంది విశ్వాసులు కొనుక్కొనేవారు. మరికొంత మందికి ఇది అభ్యంతరంగా ఉండినది. విగ్రహార్పితమైన మాంసాన్ని విశ్వాసులు తినవచ్చా? అన్న ప్రశ్న ఎదురైంది. "భోజనమును బట్టి దేవుని యెదుట మనము మెప్పు పొందము. తినకపోయినందున మనకు తక్కువలేదు. తినినందున మనకు ఎక్కువ లేదు" (8:8) అని పౌలు జవాబిచ్చాడు. (మత్తయి 15:11; రోమా 14:17 కూడ చదవండి). "విగ్రహము వట్టి దనియు ఒక్కడే తప్ప వేరొక దేవుడు లేడనియు ఎరుగుదుము" (8:4) అని చెప్తూ అయితే అందరికీ ఈ జ్ఞానము లేదు (8:7) అని జ్ఞాపకం చేసాడు. చివరికి భోజన పదార్థాల వలన సహోదరులకు

అభ్యంతరం  కలుగజేయవద్దని అందుకు అవసరమైతే మాంసము తినడం మానెయ్యాలని ఒక్క ముక్కలో తేల్చి చెప్పాడు(8:13). మన స్వాతంత్ర్యము బలహీనులకు అభ్యంతరంగా ఉండకుండ చూచుకోవాలి(8:9)వారు క్రీస్తుకు విరోధంగా పాపం చెయ్యడానికి కారకులు కావొద్దు.

**ఆ) పౌలు వ్యక్తిగత జీవితమాదిరి (9:1-27) :** పౌలు ఒక అపొస్తలునిగా తన ప్రాథమిక హక్కులను చెప్తున్నాడు. అతడు క్రీస్తును చూచాడు (9:1; అపొ 9:17; I కొరి 15:8) కొరింథులో సంఘాన్ని తానే స్థాపించాడు (9:1,2); తినవలసిన వాటిని తిని త్రాగేందుకు (9:4); వివాహం చేసికొని దాంపత్య జీవిత సుఖాన్ని అనుభవించేందుకు (9:5) అధికారం ఉంది. అతడు స్థాపించిన సంఘాలు అతణ్ణి పోషించాలని ఆశించవచ్చును (9:6-11, 13, 14). ఒక సైనికుడు పోరాడినందుకు జీతం ఇవ్వబడుతుంది. వ్యవసాయకుడు ద్రాక్షతోట ఫలాలను తింటాడు. మందనుకాచేవాడు మంద పాలు త్రాగుతాడు. పౌలు వారి వలన ప్రతిఫలం పొందదగినవాడు. యాజకుడు ఆలయకృత్యాల వలన జీవిస్తాడు. సువార్త ప్రకటించేవారు సువార్త వలన జీవిస్తారు (9:14). అయితే పౌలు ఈ అధికారాన్ని వినియోగించలేదు సరికదా, సువార్తకు అభ్యంతరము కలుగజేయకుండుటకై అన్నిటిని సహించాడు (9:12). స్వతంత్రుడైయున్నా, ఎక్కువ మందిని సంపాదించుకోడానికి అందరికీ తనను తాను దాసునిగా చేసికొన్నాడు (9:19).

**ఇ) పాత నిబంధన సాదృశ్యం (10:1-33) :** ఈ భాగంలో ఇశ్రాయేలు జాతిని సాదృశ్యంగా తీసికొని దేవుడు వారికిచ్చిన స్వాతంత్ర్యాన్ని (10:1-4); వారు ఆ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేసిన విధానాన్ని (10:5-10); వారి స్వేచ్ఛ తొలగించబడిన విధానాన్ని గూర్చి వివరించాడు. ఇవన్నీ ప్రస్తుత కాలంలోని వారికి దృష్టాంతాలుగా వారికి సంభవించాయని, కొరింథు సంఘస్తులకు అన్వయింపజేసాడు (10:11-13). పై మూడు ఉదాహరణలు చెప్పాక విగ్రహాలకు అర్పించిన మాంసము తినుటను గూర్చి మరి కొన్ని విషయాలను పేర్కొన్నాడు (10:25-33).

**3. సంఘంలో విశ్వాసుల ప్రవర్తన (11 అధ్యా) :**

**A. వస్త్రధారణను గూర్చిన నియమాలు (11:1-16) :** పౌలు క్రైస్తవులు వ్యక్తిగతంగా ముఖ్యంగా దేవుని మందిరంలో ఎలా కనిపించాలో వ్రాసాడు. పురుషుడు తన రక్షకునితో గల సంబంధాన్ని తన భాగస్వామితోగల సంబంధాన్ని తెలియజేసేందుకుగాను తలపై ఏమి వేసికోకూడదు. (11:3,7). అతని వెంట్రుకలు పెంచుకోకూడదు. అది అవమానకరము (11:14); పాత నిబంధనలో అది ఒక మ్రొక్కుబడికి మాత్రమే సంబంధించినది. (సంఖ్యా 6:1-2). స్త్రీ తన భర్త పట్ల విధేయతకు లోకంలో తన ప్రత్యేక స్థానానికి సూచనగా వెంట్రుకలు పెంచుకోవాలి. పౌలు కాలంలో వేశ్యలు, బానిసలు వెంట్రుకలు కత్తిరించు కొనేవారు. స్త్రీ తలపై ముసుగు వేసికోవాలి (11:10). కొంత మంది కొన్ని వాక్యాధారాలను బట్టి సంఘంలో  దేవదూతలు కూడ అదృశ్యంగా ఉంటారని, అందుకే సంఘంలో విశ్వాసుల వస్త్రధారణ వారికి అభ్యంతరంగా ఉండకూడదని చెప్పారు. (కీర్త 138:1; ఎఫె 3:10; I తిమో 5:21; హెబ్రీ 1:14; I పేతు 1:10-12).

**B. ప్రభురాత్రి భోజన సంస్కారమును గూర్చిన నియమాలు (11:17-34) :** ఈ భాగంలో పౌలు ఈ సంస్కారములోని ప్రధాన వ్యక్తిని గూర్చి (11:23-25); దానిని అక్రమంగా ఆచరించుటను గూర్చి (11:17-22); దాని ప్రధానోద్దేశము గూర్చి (11:26,28), అయోగ్యంగా తీసికొంటే కలిగే శిక్షను గూర్చి (11:29,30) వివరించాడు.

కొరింథు సంఘంలో ప్రభు భోజన సంస్కారానికి సంబంధించి సంఘములో భోజనము చేసేవారు. ఎవరి భోజనం వారు తెచ్చుకొనే వారు. ధనికులు అతిగా భోంచేసేవారు. పేదలకు ఏమి ఉండేదికాదు. పౌలు ఈ విషయాన్ని గూర్చి గద్దిస్తూ దాని ఆధ్యాత్మిక అంతరార్థాన్ని విలువను, వివరించి చెప్పాడు. ఈ సంస్కారం, క్రీస్తుచే స్థాపించబడింది. ఆయన అనుచరుల పట్ల చెరిగిపోని ఆయన ప్రేమకు గుర్తుగా ఆచరించబడింది. అది వారి కొరకు విరుగ గొట్టబడిన క్రీస్తు శరీరానికి, ఆయన రక్తము వలననైన క్రొత్త నిబంధనకు గుర్తుగా ఉంది (10:16) అందులో ఆయన పునరాగమనాన్ని గూర్చిన ప్రతిజ్ఞ కనిపిస్తుంది. కనుక దానిని ఆచరించినప్పుడెల్లా ఆయనను జ్ఞాపకం చేసికోవాలని (11:25) స్వపరీక్ష చేసికొనకుండ, కృతజ్ఞతాపూర్వకమైన ప్రేమ లేకుండ దానిని పుచ్చుకోవద్దని మనవి చేసాడు (11:31-34).

**4. ఆత్మవరాలు : (12-14) :**

ఆత్మవరాలను గూర్చి తెలిసికొనక ముందు పరిశుద్ధాత్మ వరమునకు పరిశుద్ధాత్మ వరాలకు గల వ్యత్యాసాన్ని తెలిసికోవాలి. పెంతెకొస్తు దినాన దేవుడు పరిశుద్ధాత్మ అనే వరాన్ని పంపించాడు (అపొ1:4-8). ఆ వరం ఆ రోజు ఒక్కసారే సార్వత్రిక సంఘానికి ఇవ్వబడింది. ఒక వ్యక్తి రక్షించబడిన తక్షణమే ఆ వ్యక్తికి పరిశుద్ధాత్మ ద్వారా క్రీస్తు ఇచ్చే అసాధారణ సామర్థ్యమే ఆత్మవరము లేక కృపావరము. ఇవి నేటి వరకూ ప్రతి విశ్వాసికి ఇవ్వబడుతూనే ఉన్నాయి. జన్మతాః ఒక వ్యక్తిలో స్వాభావికంగా ఉండే సామర్థ్యాలు వేరు, ఆత్మవరాలు వేరు.

చాల మంది సంఘంలోని పలు పరిచర్యలు ఆత్మవరాలు అని ఆ ఆధిక్యత కొంత మందికే ఇవ్వబడుతుందని తలుస్తారు. కాని ప్రతి విశ్వాసికి కనీసం ఒక్క వరమైనా ఇవ్వబడుతుంది. (I కొరి 7:7; 12:7, 1; ఎఫె 4:7; I పేతు 4:10). ఏ విశ్వాసే గాని అన్ని వరాలు పొందలేడు. (I కొరి 12:29, 30). ఈ ఆత్మ వరాలన్నీ తండ్రిని మహిమ పర్చడానికి (ప్రక 4:11) విశ్వాసులకు మరియు సంఘానికి క్షేమాభివృద్ధి కలుగజేయడానికి ఇవ్వబడ్డాయి. (ఎఫె 4:12,13) ఈ రెండు ఉద్దేశాలను వివరించేందుకు పౌలు మానవ శరీరాన్ని సాదృశ్యంగా తీసికొన్నాడు.

విశ్వాసులందరూ క్రీస్తు శరీరంలో ఒక భాగము (12:12-14); విశ్వాసులందరికీ ఒకే పని ఉండదు (12:14); ప్రతి విశ్వాసి దేవుని దృష్టిలో సమానమైనవారే ముఖ్యమైనవారే (12:18); ప్రతి విశ్వాసికి మరో విశ్వాసి అవసరత ఉంది (12:15-25); సభ్యులందరు కూడ ఇతర సభ్యుల సంతోషంలో, దుఃఖంలో పాలుపంచుకొంటారు (12:26).

పరిశుద్ధాత్మచే ఇవ్వబడిన వరాలను ఉపయోగించక పోవడం (I తిమోతి 4:14; II తిమో 1:6) ఇవ్వబడని వరాలు మనకు ఉన్నట్లుగా ప్రయత్నించడం (సంఖ్యా 16:1-3; అపొ. 8:18-20). తప్పు. పౌలు రోమా 12:6-8; I కొరింథీ 12:4-10, 28 మరియు ఎఫె 4:7,8 లో పేర్కొన్న ఆత్మవరాలన్నిటిని రెండు వర్గాలుగా విభజించవచ్చు.

అ) **సూచనాత్మక వరాలు :** ఆదిమ సంఘంలో అపొస్తలుల అధికారానికి సూచనగా స్వస్థత మరియు అద్భుతాలు చేసే వరాలు ఇవ్వబడ్డాయి. (II కొరి 12:12; హెబ్రీ 2:4; రోమా 15:19)(యోహా3:2;20:30,31చదవండి) అలాగే ప్రజలకు దైవసందేశాన్ని వెల్లడించడానికి, జ్ఞానవాక్యము భాషలు, భాషలకు అర్థం చెప్పే వరం, ప్రవచనవరం ఇవ్వబడ్డాయి.

ఆ) **స్థిరమైన వరాలు :** విశ్వాసం, ఆత్మల వివేచన, పరిచర్య, బోధించుట, బుద్ధిచెప్పుట, ఉపకారము చేయుట, ప్రభుత్వము చేయుట మొదలైన వరాలు సంఘ ఆరంభం నుండి, సంఘం ఎత్తబడేంత వరకు నిలిచిఉండే వరాలు. పౌలు వీటన్నిటిని వివరిస్తూ ఆత్మవరాలను పొందిన విశ్వాసులందరిలో ఉండాల్సిన ముఖ్య లక్షణాన్ని గూర్చి 13వ అధ్యాయంలో వివరిస్తూ ప్రేమ యొక్క ప్రాధాన్యతను (13:1-3) స్వచ్ఛమైన ప్రేమను గూర్చి (13:4-7) ప్రేమ యొక్క అవినాశనత్వాన్ని (13:8-13) వర్ణించాడు.

పౌలు కాలంలో చాలా మంది భాషలలో మాట్లాడే వరాన్ని గూర్చి ఎక్కువగా ఆశపడ్డారు, ప్రార్థించారు. తద్వారా వారు హెచ్చించబడాలని ఆశించారు. క్రీస్తు హెచ్చించబడేందుకు మరియు ఇతరులు ఆశీర్వదించబడేందుకే వరాలు ఇవ్వబడ్డాయన్న సంగతిని వారు మరచిపోయారు. కనుక 14వ అధ్యాయంలో పౌలు భాషలను గూర్చి వివరించాడు.

ఇ) **భాషలు ఇవ్వడంలో దేవుని ఉద్దేశం :** అదిమ క్రైస్తవుల మరియు అపొస్తలుల అధికారానికి విలువను చేకూర్చేందుకు, అవిశ్వాసంతో ఉన్న ఇశ్రాయేలు జాతిపై దేవుని తీర్పును రూఢిపర్చేందుకు యూదులలో సత్యాన్వేషకులకు సూచనగా ఇవ్వబడ్డాయి. బైబిలులోని పుస్తకాల ప్రామాణికత నిర్ధారించబడక మునుపు సంఘకాపరులకు, పెద్దలకు సూచనలు సిద్ధాంతపరమైన ప్రధానాంశాలు లిఖిత పూర్వకంగా లేవు గనుక ఆలాంటి సత్యాలను తెలియజేసేందుకు భాషల వరాలు ఇవ్వబడ్డాయన్నది మరో తలంపు. అయితే ఆ వరము సంఘ క్షేమాభివృద్ధికి లేక (I కొరి 14:4, 19) వ్యక్తిగత క్షేమం కోసము ఇవ్వబడినా (14:4) సంఘంలో వాడేందుకు ఇవ్వబడలేదని (14:23) అలా భాషలతో మాట్లాడడం పరిశుద్ధాత్మ బాప్తిస్మంకాదని (12:13) స్పష్టంగా తెలియజేసాడు. అంత మాత్రమే కాదు భాషలు మాట్లాడే వరం ఉన్నవారు దానిని సంఘంలో ఎలా, ఎంత మట్టుకు ఉపయోగించవచ్చో వ్రాసాడు" (14:27-33).

5. **మృతుల పునరుత్థానము (15 అధ్యా) :** దేవుని వాక్యమంతటిలో ప్రాముఖ్యమైన అధ్యాయాలలో రోమా 8వ అధ్యాయం ఒకటైతే, మరొకటి I కొరింథీ 15 అధ్యాయం అని చెప్పవచ్చును. ఈ అధ్యాయంలో పునరుత్థానం యొక్క ఔన్నత్యం (15:1-4) పునరుత్థాన ఋజువు (15:5-11) పునరుత్థాన ప్రాధాన్యత (15:12,19,29-32) గూర్చి వ్రాయబడింది. ప్రస్తుత దినాలలో వలెనే, పౌలు దినాలలో కూడ పునరుత్థానాన్ని నిరాకరించినవారున్నారు.

కనుక ఈ సిద్ధాంతాన్ని తృణీకరించేవారికి కలిగే పరిణామాలను పౌలు ఈ భాగంలో వివరించాడు. ఈ సందర్భంగా పౌలు, లేవీయకాండం 23వ అధ్యాయంలోని యూదుల 7 పండుగుల్లో ఒక పండుగ అయిన ప్రథమ ఫలముల పండుగను ప్రస్తావిస్తున్నాడు (15:20). మరణం నుండి క్రీస్తు ద్వారా తిరిగి లేపబడిన వారికంటే ఆయన పునరుత్థానం ప్రత్యేకమైంది. వారందరు తిరిగి చనిపోయారు. క్రీస్తు పునరుత్థానం ఆయన పునరాగమనంలో విశ్వాసులను తనవారిగా చేసికొనే పునరుత్థానం (15:23) వారు ఆయన వెనుక ఊరేగింపుగా వెళ్తారు. (I కొరి 15:53; I థెస్స 4:16).

పునరుత్థానం విషయం దేవుడు ఏ పద్ధతిని ఉపయోగిస్తాడో పౌలు చెప్పలేదు. కాని గోధుమగింజను సాదృశ్యంగా తీసికొని వివరించాడు (15:35–38) గోధుమ గింజకు మొక్కగా మారే శక్తి లేదు. దేవుడే దానిని మొలిపించాలి. అది మొక్కగా మారాలంటె ఆ గింజ చావాలి. మరణం ఆ గింజను అణచివేయదు గాని దాన్ని విడిపిస్తుంది. అది దాని గుర్తింపును కోల్పోదు. గత స్థితి నిలిచి ఉంటుంది (I కొరి 13:12).

ఇక పునరుత్థానం యొక్క పరిపూర్ణత (15:39–49) విషయానికొస్తే విశ్వాసి దేహము ప్రాచీన పాప శరీర లక్షణాలతో క్షయమైనదిగా, ఘనమైనదిగా, బలహీనమైనదిగా, ప్రకృతి సంబంధమైనదిగా విత్తబడుతుంది (15:42–44). క్రొత్త పాపరహిత శరీర లక్షణాలతో అక్షయమైనదిగా, మహిమగలదిగా, బలమైనదిగా, ఆత్మసంబంధమైనదిగా లేపబడుతుంది. ఈ భాగంలో పౌలు ఒక మర్మాన్ని చెప్తున్నాడు (15:15–53). అదేమంటే క్రైస్తవులందరూ మరణిస్తేనే పరలోకానికి వెళ్ళరుగాని లక్షలాది మంది క్రైస్తవులు ఒకానొక దినాన మరణాన్ని రుచి చూడకుండానే పరలోకానికి వెళ్తారు. అదే ఆ మర్మము (I థెస్స 4:16,17 చదవండి).

క్రైస్తవులందరూ పునరుత్థాన ఉద్దేశాన్ని తెలిసికొని ఉండాలి (15:54). దేవుడు కేవలం ఆధ్యాత్మిక విషయాలను గూర్చే శ్రద్ధ వహించడు. భౌతిక విషయాలను గూర్చి ముఖ్యంగా విశ్వాసుల దేహాలను గూర్చి కూడ శ్రద్ధగలవాడు అనే ఉద్దేశం ఇక్కడ కనిపిస్తుంది (I కొరి 6:19; 20; I కొరి 6:16; ఎఫె 5:28, 29; రోమా 12:1,2). మనిషికి కడపటి శత్రువైన మరణాన్ని నాశనం చెయ్యడం పునరుత్థానం యొక్క మరో ఉద్దేశం (15:26).

6. **పరిశుద్ధుల కొరకైన చందా (16:1–4) :** పౌలు గలతీయలోని సంఘాలకు నియమించిన ప్రకారమే ఈ విరాళాలను ప్రోగు చేయాలని చెప్పాడు. దేవుడు వారిని వర్ధిల్లజేసిన కొలది (16:2) ప్రతి ఆదివారము సంఘముగా ఆరాధనకు కూడుకొన్నప్పుడు (16:2) ప్రతి ఒక్కరూ ఇవ్వాలి. ఈ విరాళాలు యెరూషలేములో ఉన్న విశ్వాసులలో పేదల కొరకు (రోమా 15:26) ప్రోగు చేయబడ్డాయి. వాస్తవంగా స్థానిక సంఘం, దాని సభ్యుల ఆర్థిక సహాయంతో నడిపించబడాలి అందులో ప్రతి ఒక్కరి పాలిభాగం ఉండాలి. అయితే ఆర్థిక పరమైన విషయాలను ఒక్కరే కాకుండ కొంతమంది పర్యవేక్షించడం వలన అనర్థాలను అరికట్టవచ్చును. ముఖ్యంగా ఈ బాధ్యతను యోగ్యులైన వారికి, నమ్మకమైనవారికే అప్పగించాలి (16:3). చివరగా పౌలు కొన్ని వ్యక్తిగతమైన మాటలు మరియు గొప్ప సవాలుతో ఈ పత్రికను ముగించాడు (16:5–24).

# కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక సంగ్రహ సమీక్ష

**A. ఉపోద్ఘాతము :** పౌలు కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రికను వారు ఎలా స్వీకరించారో, అతని గద్దింపులకు ఎలా ప్రతిస్పందించారో తెలిసికోవడానికి తీతును పంపించాడు. తరువాత తిమోతిని కూడ పంపించాడు. పౌలు తన మూడవ సౌవార్తిక యాత్రలో ఫిలిప్పీ పట్టణంలో ఉన్నప్పుడు తీతు కొరింథు సంఘం నుండి సమాచారాన్ని తీసికొని వచ్చాడు. వారు తన పత్రికను సహృదయంతో స్వీకరించారని తెలిసి పౌలు సంతోషించాడు.

1. **ఉద్దేశం :** కొరింథు సంఘంలో కొంత మంది పౌలు ఉద్దేశాల పట్ల సందేహాన్ని వ్యక్తపర్చారు. అతడు యేసుక్రీస్తు ద్వారా ఏర్పరచబడిన 12 మంది అపొస్తులులలో ఒకడు కాడు గనుక అతని అపొస్తలత్వాన్ని త్రోసిపుచ్చారు. కనుక పౌలు తన అపొస్తలత్వాన్ని నిరూపిస్తూ, కొరింథీయులు తన పత్రికను స్వీకరించినందుకు తన సంతోషాన్ని వ్యక్తపరుస్తూ ఈ రెండవ పత్రికను వ్రాసాడు.
2. **గ్రంథ విశిష్ఠత :** పౌలు వ్రాసిన ఇతర పత్రికలన్నింటిలో, తన వ్యక్తిగత చరిత్రను ఎక్కువగా వివరించినది ఈ పత్రికలోనే. అతని జీవితంలో సంభవించిన కొన్ని సంఘటనలు అనగా గంపలో దాచి పెట్టబడి దమస్కునుండి పంపించబడుట (11:32,33) మూడవ ఆకాశానికి కొనిపోబడుట (12:1-4) అతని శరీరంలోని ముల్లు (12:7) అసాధారణమైన శ్రమలు (11:23-27) ఈ పత్రికలో మాత్రమే ప్రస్తావించబడ్డాయి.
3. **ముఖ్యాంశం :** యేసుక్రీస్తు మన ఆదరణ. ఈ పత్రిక ఆదరణ అనే మాటతోనే ఆరంభమై (1:3) ఆదరణ అనే మాటతోనే ముగించబడింది (13:11) మధ్యలో ఆదరణకు కారణాన్ని (9:8) ఆదరణకు మూలమును (12:9) తెలిసికొంటాము. అన్ని విషయాలలో క్రీస్తు మనకు చాలినవాడు.

## B. గ్రంథ విభజన :

### I. దేవుని ఆదరణ (క్రైస్తవ జీవితము) 1-7 అధ్యా.

1. ఉపోద్ఘాతము (1:1,2).
2. పౌలు జీవిత ప్రణాళికల్లో దేవుని ఆదరణ (1:3-24).
3. పాపంలోపడిన పరిశుద్ధుని పునరుద్ధరణలో దేవుని ఆదరణ (2 అధ్యా).
4. క్రీస్తు యొక్క పరిచర్యలో దేవుడిచ్చే ఆదరణ (3 అధ్యా).
5. క్రీస్తు కొరకు పొందుతున్న శ్రమల్లో దేవుని ఆదరణ (4 అధ్యా).
6. క్రీస్తు కొరకు హతసాక్షులయ్యే పరిచర్యలో దేవుని ఆదరణ (5 అధ్యా).
7. క్రీస్తు కొరకు చేసే పరిచర్యలో అన్ని పరిస్థితులలో దేవుని ఆదరణ (6 అధ్యా).
8. పౌలు హృదయంలో ఉన్న దేవుని ఆదరణ (7 అధ్యా).

### II. యెరూషలేములోని పేదలైన,పరిశుద్ధుల కొరకైన చందా (క్రైస్తవ దాతృత్వము)8,9 అధ్యా

1. క్రైస్తవ దాతృత్వానికి మాదిరి (8:1-6).

2. క్రైస్తవ దాతృత్వపు ఔన్నత్యము (8:7-15).
3. క్రైస్తవ దాతృత్వం గూర్చిన వివరణ (8:16-9:5).
4. క్రైస్తవ దాతృత్వాన్ని గూర్చిన ప్రోత్సాహం (9:6-15).

**III. అపొస్తలుడైన పౌలు పిలుపు 10-13 అధ్యా**

1. పౌలు అపొస్తలత్వాన్ని గూర్చిన అధికారం (10 అధ్యా).
2. పౌలు అపొస్తలత్వపు గౌరవాన్ని నిలుపుకొనుట (11 అధ్యా).
3. పౌలు అపొస్తలత్వము గూర్చిన ప్రత్యక్షత (12 అధ్యా).
4. పౌలు అపొస్తలత్వపు నిర్వహణ (13:1-10).
5. పౌలు అపొస్తలత్వాన్ని గూర్చిన వివరణ ముగింపు (13:11-14).

## C. అంశాలవారిగా సంక్షిప్త వివరణ :

**I. ఆదరణ :**

1. **ఆదరణకు మూలము (1:1-7) :** ఈ భాగంలో పౌలు దేవుడు (1:3) మరియు మన శ్రమలు మన ఆదరణకు మూలంగా ఉన్నట్లు తెలిపాడు. మనకు శ్రమలు వస్తేనే ఆదరణ అంటే ఏంటో తెలిసికోగలుగుతాము.
2. **ఆదరణ అవసరత (1:8) :** ఈ లోకంలో ఆదరణ అక్కరలేనివారు ఎవరూ ఉండరు. ప్రాణంతో ఉన్న ప్రతి ఒక్కరు ఇతరులచే ఆదరించబడాలని కోరతారు.
3. **ఆదరణ ఉద్దేశం (1:4,5) :** విశ్వాసులైన వారికి ఆదరణ ఎందుకు అవసరం అన్న ప్రశ్న మీకు రావొచ్చు. విశ్వాసులుగా మనం ఇతరుల పరిస్థితులను బట్టి జాలి చూపించడంకన్న వారితో సహానుభవం కలిగి ఉన్నప్పుడే వారిని ఆదరించగలుగుతాము. (హెబ్రీ 2:14-18; 4:14-16). కనుక మనకు శ్రమలు అవసరం, శ్రమల్లో ఆదరణ అవసరం. మనం ఎంతగా శ్రమపడితే అంతగా ప్రభువుచే ఆదరించబడతాము. ఇతరులను ఆదరించ గలుగుతాము.

**II. వివరణ (1:8-2:13) :** ఈ భాగంలో పౌలు తన ప్రయాణాల వివరాలు అక్కడ జరిగిన సంఘటనలను వివరించాడు. ఆసియాలో (1:8-14) అతనికి ఏమి జరిగిందో తెలియదు. కాని అతడు వెళ్ళిన గొప్ప శ్రమలలో దేవుణ్ణి మరెక్కువగా తెలిసికోగలిగాడు. అబ్రాహాము, ఇస్సాకులకున్న విశ్వాసం లాంటి విశ్వాసాన్ని పొందగలిగాడు (1:10), తరువాత మాసిదోనియాలో అతని అనుభవాలు (1:5-24; 2:1,12,13) ఎఫెసులో అతనికి కలిగిన దుఃఖాన్ని గూర్చి వ్రాసాడు (2:2-11).

**III. పరిచర్య విధానమును గూర్చిన ప్రదర్శన (2:14-6:18) :**

1. **సాక్ష్యము :** పౌలు కాలంలో యూదుల ధర్మశాస్త్రోపదేశకులే పౌలు సమస్యలకు కారకులయ్యారు. అతనితో పోట్లాడేందుకు కాచుకొని ఉండేవారు. పౌలు యెరూషలేము సంఘము నుండి సిఫారసు పత్రాన్ని తీసికొనివచ్చాడా? అని ప్రశ్నించేవారు. తాను స్థాపించిన సంఘాలకు వెళ్ళడానికి మరొకరి సిఫారసు అవసరమా? అందుకే పౌలు ఆ సంఘస్తులతో

మా పత్రికలు మీరే కదా? అన్నాడు (3:1-4) కొరింథులోని నిజ విశ్వాసులే సేవకుడైన పౌలుకు, ప్రభువైన క్రీస్తుకు సిఫారసు పత్రికలుగా ఉన్నాడు. నిజమే క్రైస్తవులు లోకము చదివే మత గ్రంథాలుగా ఉండాలి. అన్యులు దేవుని వాక్యాన్ని చదువరు క్రైస్తవుల జీవితాన్ని చదువుతారు. అలా మన జీవితాలు తెరువబడిన పత్రికలుగా ఉంటే, ప్రజలు దేవుని వద్దకు రాగలుగుతారు. అంతమాత్రమే కాదు బైబిలులోని పత్రికలు అందుబాటులో లేనప్పుడు ఈ సజీవ పత్రికలే చదువబడతాయి.

2. **పరిచర్య విధానం :** పౌలు పరిచర్య విజయవంతమైనది (2:14-16) యథార్థమైనది (2:17) దేవునిచే ఆమోదించబడినది (3:1-3) శ్రేష్ఠమైనది (3:6-18) బహిర్గతమైనది (4:1-4) క్రీస్తును ఘనపర్చేది (4:5-7) శ్రమాసహితమైనది (4:8-18) నిశ్చయమైనది (5:1-9).

3. **పరిచర్యలో శ్రమలు :** అతనికి రాబోయే శ్రమలను గూర్చి పౌలు పిలువబడినప్పుడే చెప్పబడింది. కాని అన్ని శ్రమలలో పౌలు ఆశావాదిగానే ఉన్నాడు, నిరాశావాది అవకాశాల్లో శ్రమల్ని వెదకుతాడు. ఆశావాది ప్రతి కష్టంలోను ఓ అవకాశాన్ని వెదకుతాడు. ఈ లోకంలో ఎంత శ్రమ పడితే, పరలోంలో అంతగా మహిమ ఉందని పౌలుకు తెలుసు (4:8-18) మనల్ని శ్రమల నుండి విడిపించేందుకే దేవుడు వాటిని అనుమతిస్తాడు. ఈలాంటి శ్రమల్లో పౌలు పునరుత్థాన సత్యాన్ని బట్టే ఆదరణ పొందాడు (5:10). పౌలు పరిచర్య లక్ష్యమంతా మానవులను దేవునితో సమాధానపరచడం. సమాధానపర్చబడిన వారందరూ పరిశుద్ధంగా జీవించాలని పౌలు జ్ఞాపకం చేసాడు (6:14-18). పాపుల రక్షణ అవసరత (5:14) పరిశుద్ధులకు జరుగబోయే తీర్పు (5:10) ప్రభువును గూర్చిన భయము (5:11 సువార్తలోని శక్తి (5:17) అన్నిటికంటె ముఖ్యంగా క్రీస్తు ప్రేమ అతన్ని ఈ పరిచర్య కొరకు బలవంతం చేసింది.

**IV. కృతజ్ఞతలు చెల్లించుట (7 అధ్యా) :** తాను వ్రాసిన మొదటి పత్రికను చదివిన కొరింథు సంఘస్థుల ప్రతిస్పందన కోసం ఆతురతతో ఎదురు చూచిన పౌలు, తీతు రాకను బట్టి సంతోషిస్తూ దేవునికి కృతజ్ఞతలు చెల్లించాడు (7:1-6). అతని పత్రిక వారిలో దుఃఖాన్ని కలుగజేసినా ఆ దుఃఖం వారిలో రక్షణార్థమైన మారుమనస్సును కలుగజేసిందని, తీతు చెప్పిన సమాచారాన్ని బట్టి తెలిసికొని కృతజ్ఞత చెల్లించాడు (7:7-16). ధైర్య పరచబడ్డాడు.

**V. క్రైస్తవ దాతృత్వమును గూర్చి విన్నవించుట (8, 9 అధ్యా) :** ఈ భాగంలో దాతృత్వానికి మాసిదోనియా సంఘమును (8:1-5) యేసుక్రీస్తును (8:9) తండ్రియైన దేవుణ్ణి (9:15) మాదిరిగా చూపించాడు. మన దాతృత్వం ఎలా ఉండాలో వివరించాడు (8:2,3,12-14; 9:6,7). క్రైస్తవ దాతృత్వం అక్కరలో ఉన్నవారికి (9:12) మరియు ఇచ్చినవారికి (9:8-10) దీవెనలనిస్తుంది. అక్కరలు తీర్చబడిన వారు మన విషయం దేవునికి కృతజ్ఞత చెల్లిస్తారు (9:12) ప్రార్థిస్తారు (9:14) దేవుణ్ణి మహిమపరుస్తారు (9:13). అందుకు తప్పకుండా ప్రతిఫలం పొందుతామనే దానికి ఋజువుగా లౌకికమైన (9:6), వాక్యానుసారమైన (8:15, నిర్గ 16:8, 9:9, కీర్త 112:9) రుజువులను చూపించాడు.

## VI. అపొస్తలత్వపు గౌరవాన్ని నిలుపుకొనుట (10-13 అధ్యా) :

1. పౌలు వ్రాతలు బలమైనవేగాని అతడు భౌతికంగా బలహీనుడని కొంతమంది నేరారోపణ చేసారు (10 అధ్యా). కాని దాని గూర్చిన వివరాలేమి లేవు. పట్టణం వెంబడి పట్టణాన్ని తలక్రిందులు చేసిన ఇతడు బలహీనుడు అనడం అసంబద్ధమైంది. అతడు బలమైన వ్యక్తిత్వం మరియు శ్రేష్ఠమైన వరాలు గలవాడు. సూక్ష్మగ్రాహి. అన్నింటికంటె ముఖ్యంగా క్రీస్తు అతనిలో ఉండి అతని ద్వారా పనిచేసాడు. అపొస్తులులెవ్వరూ తమ పోషణ కోసం పనిచెయ్యలేదన్న మరో నేరారోపణ అతనిపై చేయబడింది.
2. పౌలు ఇతర అపొస్తులులతో పోల్చి చెప్తూ, తనకు జీతం తీసుకొనే హక్కు ఉన్నా, పరిచర్యను ఒక వృత్తిగా లేక వ్యాపారంగా భావించేవారికి మాదిరిగా ఉండేందుకే అలా చేస్తున్నానని చెప్పాడు (11:6-12) పౌలు అపొస్తులునిగా క్రీస్తునందే అతిశయించాడు. తనకున్న ఆధిక్యతలను బట్టికాక తన శ్రమలయందే అతిశయించాడు (11:16-33). అతడు పొందిన విశేష దర్శనాన్ని బట్టి అతిశయపడాల్సి వచ్చింది (12:1-4) మరో వింతైన విషయం ఏమంటే అతడు తన బలహీనత యందే అతిశయించాడు (12:5-12) పౌలు బలహీనత ఏదైనప్పటికిని, ఏకారణాన్ని బట్టి అనుమతించబడినప్పటికిని దేవుడు తనకృప చాలునని రుజువు చేసాడు. అసాధారణమైన పనుల కొరకు దేవుడు అసాధారణ శక్తినిస్తాడు. అందుకే పౌలు **"నేను ఎప్పుడు బలహీనుడనో అప్పుడే బలవంతుడను"** అని అన్నాడు (12:10) క్రీస్తు నివసించే హృదయంలో ధైర్యం, శక్తి ఉంటాయి.
3. ఈ పత్రిక చివరి భాగానికొచ్చేసరికి పౌలు ప్రతి విశ్వాసిని స్వపరీక్ష చేసికొనమని వ్రాసాడు (13:5) ఎవరేగాని తాము ఏమై ఉన్నారో తెలిసికోడానికి వారి ఆధ్యాత్మిక స్థాయిని తెలిసికోడానికి, తమ్మును తాము మోసం చేసికొనకుండ ఉండేందుకు స్వయం పరీక్ష చేసికోవడం అవసరం, మతపరమైన విషయాలు, గత అనుభవాలు మన విశ్వాసానికి ప్రమాణాలుకావు. వాటిని ఆధారం చేసికోవద్దు. క్రీస్తును మన ప్రస్తుత ప్రేమ, విశ్వాసం, సేవలనే ఆధారం చేసికొని పరీక్షించుకోవాలి. మన జీవితాన్ని నిర్దేశించే ఉద్దేశాలను పరీక్షించుకోవాలి. అవి మనుష్యులను సంతోషపరచేవా? లేక క్రీస్తునా? మనం బాగానే ఉన్నామని తలంచవచ్చు. కాని క్రీస్తు మనల్ని పరిపూర్ణులుగా ఉండాలని కోరుతున్నాడు. కనుక మనకు క్రీస్తును గూర్చిన ఆలోచనలు ప్రియమైనవిగా ఉన్నాయా? దేవుని వాక్యం మరియు ప్రార్థన పట్ల ఆసక్తి పెరుగుతున్నదా లేక తరుగుతున్నదా? క్రీస్తు సంఘం పట్ల ఆయన సేవ పట్ల మన ప్రేమ ఎలా ఉంది? అని పరీక్షించుకోవాలి. ప్రభువు మనందరికీ అట్టి కృప దయచేయును గాక!

**TTB - Telugu - Study Outlines - Books of I & II Corinthians**
Printed by : Premadhara, Trans World Radio - India, 12-1-334/17/3,
Lalapet, Secunderabad - 500 017. Ph : 040-27003011.

**FREE** MP3 DOWN LOAD - Log on to :
**www.radio882.com**